హామీ నెరవేర్చి.. అవస్థలు తీర్చి

ఇచ్చిన హామీ నెరవేర్చి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాట నిలుపుకుంది. రూ.8.94 కోట్లతో వంతెన నిర్మాణం, రూ.7.38 కోట్లు వెచ్చించి 14 కి.మీ పొడవున తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి పది గ్రామాల ప్రజల రోడ్డు, వంతెన కష్టాలను తీర్చిన వైనమిది. పనులు పూర్తవడంతో హామీల అమలులు జగనన్నకు సాటిరారని మరోసారి నిరూపితమైందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

- రూ.8.94 కోట్లతో పేరూరు–శిరివెళ్ల మధ్య వక్కిలేరు వాగుపై వంతెన పూర్తి
- పేరూరు– చందలూరు వరకు రూ.7.38 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం
- తొలగిన వంతెన కష్టాలు
- పది గ్రామాల ప్రజలకు మార్గం సుగమం
- మాట నిలుపుకున్న గత ప్రభుత్వం


పేరూరు–శిరివెళ్ల వైపు వక్కిలేరు వాగుపై నిర్మించిన వంతెన


వంతెన పైభాగంలో తుదిమెరుగులు దిద్దుతున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని పేరూరు– ఎర్రగుంట్ల,ఎర్రగుడిదిన్నె–జాతీయరహదారి, చిలుకలూరు–బత్తలూరు, రుద్రవరం–శిరివెళ్ల వైపు వర్షాకాలంలో రాకపోకలు సాగించాలంటే వక్కిలేరు వాగు అడ్డుకునేది. అటు వైపు వంతెనల సమస్యలు ఉండటంతో నంద్యాల వైపు వెళ్లలేక అవస్థలు పడేవారు. ఎన్నో ఏళ్ల నుంచి సమస్య వేధిస్తున్నా పట్టించుకునే నాయకుడు, అధికారి లేకపోయారు. ఇక పొలాలు,భూములు,ఇళ్లు వంటివి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే.. మండల కేంద్రం శిరివెళ్లకు వెళ్లాల్సిందే. కారణం రిజిస్ట్రేషన్ కార్యాలయం అక్కడే ఉన్నందున. వర్షాకాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా, అత్యవసర పనులపై నేరుగా శిరివెళ్లకు వెళ్లలేక ఆళ్లగడ్డ నుంచి చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి. అయితే ఎర్రగుడిదిన్నె,పేరూరు వద్ద వంతెనలు ఉండటంతో అటువైపు నుంచి జాతీయ రహదారి మీదుగా శిరివెళ్ల, నంద్యాల వైపు వెళ్లేవారు. వంతెన కష్టాలను పరిష్కరించాలని గతంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ప్రజల విన్నపాలు వాగుల్లో కలిసిపోయాయి. అయితే గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి సమస్యను నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించారు.

పనుల వివరాలు..

పేరూరు–శిరివెళ్ల మధ్య నూతన వంతెన నిర్మించేందుకు రూ.8.94 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో ఈ ఏడాది ఫిబ్రవరి 23న ఎంపీ, ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం వక్కిలేరు వాగుపై వంతెన నిర్మాణం పూర్తయ్యింది. వంతెన పై భాగాన తుది మెరుగుల పనులు సాగుతున్నాయి. త్వరలో వినియోగంలోకి రానుంది. అలాగే పేరూరు నుంచి ఎర్రగుడిదిన్నె,చిలుకలూరు,చందలూరు వరకు 14 కి.మీ పొడవున తారు రోడ్డు నిర్మాణానికి రూ.7.38 కోట్లు మంజూరు కాగా పనులు పూర్తయ్యి రాకపోకలు సాగుతున్నాయి. దీంతో మండలంలోని మందలూరు,చందలూరు,నక్కలదిన్నె,మాచినేనిపల్లె,బి.నాగిరెడ్డిపల్లె,వెలగలపల్లె,కొండమాయపల్లె తదితర గ్రామాల ప్రజల కష్టాలు తొలగనున్నాయి.


పేరూరు నుంచి చందలూరు వరకు వేసిన తారురోడ్డు

రోడ్డు సమస్య తీరింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే మాకు రోడ్డు సమస్య తీరింది. అంతకు ముందు ప్రభుత్వాలు మారినా.. గుంతలమయమైన రోడ్డు సమస్యను పరిష్కరించలేదు. గంగుల కుటుంబీకులు అప్పటి సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. సాధారణ ఎన్నికలకు ముందు పడకండ్ల నుంచి మందలూరు,చందలూరు మీదుగా బి.నాగిరెడ్డిపల్లె మెట్ట వరకు తారు రోడ్డు పనులు ప్రారంభించారు. చందలూరు నుంచి మందలూరు వరకు బీటీ రోడ్డు వేశారు. అలాగే..చందలూరు నుంచి పేరూరు మీదుగా శిరివెళ్ల వైపు కొత్త రోడ్డు, వంతెన నిర్మించి మాట నిలుపుకున్నారు.

– శ్రీనివాసరెడ్డి, మందలూరు

వైఎస్సార్‌సీపీని మరువలేం



జీవితాంతం గుర్తుండిపోయేలా అభివృద్ధి పనులు చేసిన వైఎస్సార్‌సీపీని మరువలేం. గతంలో ఎందరో సర్పంచుగా పని చేశారు కానీ.. గ్రామాల్లో ఇన్ని అభివృద్ధి పనులు చేయించలేకపోయారు. జగనన్న హయాంలో అంతర్గత సీసీ రోడ్లు, తారు రోడ్లతో పాటు వంతెన నిర్మాణం నేను సర్పంచ్‌గా ఉన్నప్పుడు పూర్తి కావడం నా అదృష్టం. చుట్టు పక్కల గ్రామాల ప్రజలందరి కష్టాలు తీరినట్లే. ఎంత వర్షం కురిసిన వాగు దాటుకుని వెళ్లేలా వంతెన నిర్మాణం సాగింది. గతంలో వంతెన లేక అటు వైపు ఉన్న పొలాలను బీడుగా వదిలేసేవాళ్లం. ఇప్పటి నుంచి వాటిల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం కలిగింది.

– దేవదానం,పేరూరు సర్పంచ్

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన నంద్యాల డీఎస్పీ


పి.శ్రీనివాసరెడ్డి

నంద్యాల: నంద్యాల డీఎస్పీగా పి.శ్రీనివాసరెడ్డి సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరెడ్డి ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరి 2007లో సీఐగా ప్రమోషన్ పొందారు. 2020లో పత్తికొండ డీఎస్పీగా పనిచేశారు. ఇటీవల నంద్యాల డీఎస్పీగా ఉన్న యుగంధర్‌బాబుకు ఏఎస్పీగా పదోన్నతి రావడంతో ఈ స్థానంలో శ్రీనివాసరెడ్డిని డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరెడ్డికి పట్టణంలోని ఎస్‌ఐలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చక్కని జీవన శైలితో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న డాక్టర్ సింధూజ

ఆళ్లగడ్డ: మానసిక ఒత్తిడి లేని చక్కని జీవన శైలితో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మానసిక వైద్యురాలు డాక్టర్ సింధూజ అన్నారు. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీల్లో సోమవారం బాలికలకు మానసిక వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పోషణ, వ్యాయామం, మానసిక ఆరోగ్యం, రోగనిరోధక వ్యవస్థ అవసరమన్నారు. ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు ఉషారాణి, ప్రిన్సిపాళ్లు రాజు, కవిత తదితరులున్నారు.

ఆదివాసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శంకర్‌నాయక్


శంకర్‌నాయక్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడిగా శంకర్‌నాయక్‌ను నియమించినట్లు సోమవారం ఆయన తెలిపారు. ఈనెల 10వ తేదీన విజయవాడలోని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గౌరవ సలహాదారుడిగా నంద్యాలకు చెందిన తనను ఎన్నుకున్నారన్నారు. సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈఓ జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ధనుంజయుడు మాట్లాడుతూ రేకుల షెడ్లలో పాఠాలు నిర్వహిస్తూ అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్నారని, అలాంటి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అధిక శాతం ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదన్నారు. శానిటేషన్ సర్టిఫికెట్ లేకుండా పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. నాయకులు ఎర్రిస్వామి, సురేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామ పొలిమేరలోని తుప్పల్లో పేకాట ఆడుతున్న నలుగురిని సోమవారం రాత్రి పోలీసుల అరెస్టు చేసి, వారి నుంచి రూ.17,500ల నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన వారిలో శెట్టివీడు గ్రామానికి చెందిన నరసింహారావు, ముత్యాలపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల పెద్దయ్య, ఆలమూరు గ్రామానికి చెందిన రాజశేఖర్, గోరె బాషాలు ఉన్నట్లు చెప్పారు. ఏఎస్‌ఐ షేక్ అబ్దుల్ నబీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ఆలమూరుకు చెందిన మధు,అబ్దుల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం నర్సాపురం వైపు నుంచి ఆటోలో ఆలమూరుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి రోడ్డుపై నుంచి దూస కెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది.దీంతో ఆటోలో ఉన్న వారు ఎగిరి కింద పడ్డారు. ఒకరికి కాలు విరగ్గా, మరొకరి తలకు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉపన్యాస, వ్యాసరచన పోటీలు


మెమెంటో అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో సోమవారం ప్రపంచ సైన్స్ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవం, బాలల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీలకు 36 పాఠశాలల నుంచి 360 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ బాషా, కో ఆర్డినేటర్ ఆనంద్ గురూజీ తెలిపారు. ముఖ్యఅతిథులుగా డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్, ఎంఈఓ బ్రహ్మంనాయక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు. ముందుగా ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ సమాజంలో అవయవదానం గురించి అవగాహన విద్యార్థుల పాత్ర అనే అంశంపై, పర్యావరణ పరిరక్షణలో కృత్రిమ మేధా పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలను ఈనెల 14వ తేదీన కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

అబుల్‌కలాం ఆజాద్ జయంతి


ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబుల్ కలాం ఆజాద్ జయంతి సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అధ్యాపకులు మాలన్న, వెంకటలక్ష్మమ్మ, కుసుమకుమారి పాల్గొన్నారు. అలాగే.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరీముల్లా ఆధ్వర్యంలో ..నంద్యాల ఆల్‌మేవా ఏపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అబులైజ్, అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్‌పాషా పాల్గొని ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

శిరివెళ్ల: దేశ ప్రథమ విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మండలంలో సోమవారం జరుపుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో టీచర్లు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లుర్పించారు.

నంద్యాల(అర్బన్): ఆల్ మదద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుమల్ల రహీం ఆధ్వర్యంలో సోమవారం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి ఫౌండేషన్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. శివరామిరెడ్డి, మహబూబ్‌బాషా, ఆటోనగర్ వాసు పాల్గొన్నారు. అలాగే.. ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

పాఠశాలలకు గ్రాంటు విడుదల

శిరివెళ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ మంజూరైందని ఏంఈఓ శంకరప్రసాద్ సోమవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంభంధించి 35 పాఠశాలలకు గ్రాంట్లు విడుదలయ్యాయని, వాటిని ఆయా పాఠశాలల విద్యా కమిటీల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు.

25 గోకులంషెడ్లు మంజూరు

ఉయ్యాలవాడ : పశు పెంపకందారులకు ప్రభుత్వం మంజూరు చేసిన గోకులాలు షెడ్లు కోసం 57 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం 25 యూనిట్లు మంజూరు చేసినట్లు ఉపాధి ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండుపల్లె, కాకరవాడ, సర్వాయిపల్లె, రూపనగుడి, మాయలూరు, నర్సిపల్లె, పడిగెపాడు, పుచ్చకాయలపల్లె, ఆర్.జంబులదిన్నె, తుడుమలదిన్నె గ్రామాలకు చెందిన ఒక్కొక్క లబ్ధిదారునికి ఒకటి చొప్పున మంజూరయ్యాయన్నారు. అలాగే బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు, హరివరం, ఇంజేడు, గోవిందపల్లె గ్రామాల్లో ఇద్దరు లబ్ధిదారుల చొప్పున, ఉయ్యాలవాడలో ఐదుగురికి గోకులం షెడ్లు మంజూరైనట్లు వెల్లడించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఏపీ భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ, సంఘాన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య మాట్లాడుతూ ప్రత్యేక ఇసుక ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని, ఇసుకపై అన్ని ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు.

ఓటరు జాబితాలను సరిచూసుకోండి

శిరివెళ్ల: సాగునీటి సంఘాల ఎన్నికల జాబితాలను సరిచూసుకోవాలని తహసీల్దార్ పుష్పకుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన మండలంలోని కేసీ కెనాల్, తెలుగు గంగ, చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయన్నాయన్నారు. ఇందుకు సంబంధించి ఓటర్ల జాబితాలను గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని సూచించారు. చేర్పులు, మార్పులకు అభ్యంతారాలను తెలపడానికి ఈ నెల 20వ వరకు గడువు ఉందని చెప్పారు.

హైవేలు, రైల్వేల నిర్మాణాలకు భూసేకరణ పూర్తి చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో ప్రగతి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసేందుకు ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో సమీక్షించి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. త్వరలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉన్న నేపథ్యంలో అభివృద్ధికి సంబంధించి రాష్ట్రంలో నంద్యాల జిల్లా టాప్ ఫైవ్‌లో ఉండాలన్నారు. ఉపాధి హామీలో లేబర్ మొబలైజేషన్, దినసరి వేతన రేటు పెంపు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, హార్టికల్చర్ ప్లాంటేషన్ తదితర అంశాలలో వెనుకబడి ఉన్నామని వచ్చే గురువారం నాటికి వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. గోకులం షెడ్లు, పల్లె వనాలు, సోక్ పిట్ల నిర్మాణాలకు మంజూరు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నిస్తూ ప్రతిపాదనలను వెంటనే పంపాలన్నారు. పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలలో మంజూరైన 1,026 సీసీ రోడ్ల నిర్మాణాలకు గాను 170 పనులు గ్రౌండ్ అయ్యి 33 పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన నిర్మాణాలన్నీ గ్రౌండింగ్ కావడంతో పాటు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగు నీటి వసతి, సోక్ పిట్ల నిర్మాణాల పనుల ప్రగతిలో వెనుకబడి ఉన్నామని రోజువారి ప్రగతిపై నివేదికలు అందజేయాలన్నారు. అలాగే..వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలు 25 శాతం ఉన్నట్లు సర్వేలో వెల్లడైందని, కారణాలను వైద్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు నివేదికలు అందజేయాలన్నారు. ఉల్లాస్ పథకం కింద వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చదువుకున్న ఎస్‌హెచ్‌జీ మహిళలను విద్యా వలంటీర్లుగా గుర్తించి ఉచితంగా విద్య బోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 14 నుంచి అన్ని గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి జగదీష్ చంద్రారెడ్డి, డాక్టర్ జఫరుల్లా, రూపేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పథకాలకు నిధుల కేటాయింపులేవీ?

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు ఏ మాత్రం సరిపోదని, ప్రభుత్వం పసలేని బడ్జెట్ ప్రవేశపెట్టిందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, ఆయా శాఖల నిర్వహణకు ఎక్కువ ఖర్చు అవుతుందన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు లేవని, కొత్త జిల్లాలకు నిధులు కేటాయించలేదన్నారు. మైనార్టీ శాఖకు కేటాయించిన నిధులు వారికి ఇచ్చిన హామీలకే సరిపోదన్నారు. గృహ నిర్మాణాలకు, గ్రామాభివృద్ధి రోడ్లకు, భవనాలకు, వ్యవసాయ శాఖలకు, పాఠశాల ఉన్నత విద్యకు, మహిళా శిశు సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులు తూతూ మంత్రంలా ఉన్నాయన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు నిర్వహిస్తున్న కళాజాతను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు గౌస్, లక్ష్మణ్, ఎల్‌ఐసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, అధ్యక్షులు శుక్లా, రంగయ్య కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సీఐటీయూ, ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే జోనల్ కాన్ఫరెన్స్‌ను జయప్రదం చేయాలన్నారు. హైదరాబాద్ నుంచి ప్రారంభమైన కళాజాత 14వ తేదీన నంద్యాలకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు శ్రీనివాసరెడ్డి, భువనేంద్ర, రామకృష్ణుడు, కార్యదర్శి రంగయ్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

రుద్రవరం:స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 13వ తేదీన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ శిక్షణకు మండలంలోని అన్ని పంచాయతీల నుంచి ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొనాలని సూచించారు. సమావేశానికి వచ్చే ప్రజా ప్రతినిధులు వారి వెంట ఆధార్ కార్డులు, ఆ కార్డుకు లింకైన సెల్ నంబర్ తీసుకురావాలని చెప్పారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు,ఏపీఓ,ఏపీఎం, పీహెచ్‌సీ, పశు వైద్యాధికారులు, మండల వ్యవసాయాధికారి, ఐక్యసంఘం అధ్యక్షులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొనాలని కోరారు.

శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు


స్పటిక లింగేశ్వర ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు


ప్రథమనందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నంద్యాల(వ్యవసాయం)/ఆళ్లగడ్డ/రుద్రవరం/దొర్నిపాడు/ఉయ్యాలవాడ: కార్తీక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణంలోని నవ నందులతో పాటు వివిధ ఆలయాలు, ఆళ్లగడ్డ సమీపంలోని కాచింత క్షేత్రంతో పాటు వివిధ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించారు. ప్రథమ నంది ఆలయంలో నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే..స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. సాయంత్రం దేవాలయాల్లో ఆకాశ దీపాన్ని వెలిగించి స్వామి వారికి నాగాభరణం అలంకరించారు. భక్తులు ఉదయం నుంచే ఉపవాస దీక్షతో ఉండి సాయంత్రం నక్షత్రాలను చూసి ఉపవాస దీక్షలు విరమించారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో మన ఊరు–మనగుడి, మన బాధ్యత సంస్థ నిర్వాహకులు శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళలు బసవన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.





ఆళ్లగడ్డలోని అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు, ఉయ్యాలవాడలో నందీశ్వర ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

అబ్దుల్ అజీజ్‌కు లైఫ్‌టైం అవార్డు


మంత్రి నుంచి అవార్డుకుంటున్న అబ్దుల్‌అజీజ్

నంద్యాల(న్యూటౌన్): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ నుంచి ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ అజీజ్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 10 సంవత్సరాలుగా ఉర్దూ విద్యార్థులకు ఉచిత డీసీసెట్, హెడ్‌సెట్, టెట్, డీఎస్సీ కోచింగ్, ఉచిత మెటీరియల్ అందజేసిన అజీజ్ సేవలను గుర్తించి పురస్కారం అందజేసినట్లు ఆయన తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

దొర్నిపాడు: వివిధ సమస్యలతో కార్యాలయాలకు వచ్చే ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర, ఈఓపీఆర్డీ సులోచన సూచించారు. వారు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు.